క్లుప్తంగా

టెన్త్ పరీక్షలకు ఎనిమిది మంది గైర్హాజరు

గండేపల్లి: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ సోమవారం తెలిపారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 497 మంది విద్యార్థుకు గాను 489 పరీక్షకు హాజరైనట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించామన్నారు.

పేదలకు ఉపాధి జాబ్ కార్డులు మంజూరు చేయాలి

జగ్గంపేట: మండలంలోని గోవిందపురంలో పేదలకు ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు మంజూరు చేయాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంపూడి రాజు కోరారు. ఈ మేరకు సోమవారం జగ్గంపేటలో ఎంపీడీఓ బి.హరికృష్ణ, ఉపాధి ఏపీఓలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు రబ్బల సంకురమ్మ, నాగులపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

ప్రపంచ హోమియో దినోత్సవం



మహిళకు హోమియో వైద్య పుస్తకాన్ని అందిస్తున్న సర్పంచ్ రాంబాబు

కోటనందూరు: మండలంలో టీజే నగరం ఎంపీపీ స్కూల్లో సోమవారం ప్రపంచ హోమియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుర్ల రాంబాబు హోమియో వైద్య పితామహుడు హానీమాన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం భరతలక్ష్మి ఆర్థిక సహాయంతో సమకూర్చిన హోమియో వైద్య పుస్తకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఉపాధ్యాయులు, సీఆర్పీ బాబ్జీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

ప్రత్తిపాడు రూరల్: వాకపల్లిలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కురందాసు రాంబాబు కుటుంబ సభ్యులను, గాయపడిన గింజాల ఆదినారాయణను సోమవారం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గొంప శివకుమార్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు బియ్యం, ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కిర్లంపూడి మండల అధ్యక్షులు నైదాన రఘు, బర్ల లోవరాజు, అవ్వ ఆదినారాయణ, సారిపల్లి రమేష్, కోన గంగాధర్, నూనె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి



భీమవరపుకోటలో కుమార్‌ను సత్కరిస్తున్న దళితులు

కోటనందూరు: దళితుల అభ్యున్నతికి టీఎల్ఆర్ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరుగుల మోషే ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా దళిత వాడల్లో పర్యటించి దళితులతో సమావేశమయ్యారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని వారుంటే తెలియజేయాలని, అధికారులతో చర్చించి పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. భీమవరపుకోటలో దళిత ప్రతినిధులు కుమార్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

తుని రూరల్: ఎస్సీలను ఏ,బీ,సీ,డీ వర్గాలుగా వర్గీకరించాలని మాదిగ దండోరా నియోజకవర్గ అధ్యక్షుడు పలివెల శివమణి డిమాండ్ చేశారు. సోమవారం తుని మండలం లోవకొత్తూరులో దండోర ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివమణి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 27 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటాన్ని గుర్తించి వర్గీకరించాలన్నారు. మాదిగలందరూ ఏకమై భవిష్యత్ ఉద్యమాలకు అవసరమైన కార్యాచరణ చేస్తామన్నారు. అనుపు సత్తిబాబు, పలివెల శ్రీను, ఇందుగపల్లి సత్యనారాయణ, కాకాడ జ్యోతి కుమార్, పెదపూడి చిలకయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జొన్నకూటి సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ నిరసన

తుని/జగ్గంపేట/గండేపల్లి: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తునిలో టీడీపీ నాయకుడు యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో ర్యాలీ చేసి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జగ్గంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై భారం మోపుతోందని ఆరోపించారు.

హాటుపాట్లు

- మండిపోతున్న ఎండలు
- మెట్టలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- అల్లాడిపోతున్న జనం

ప్రత్తిపాడు: మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సోమవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటలకే రోడ్లపై రాకపోకలు తగ్గాయి. సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

నిర్మానుష్యంగా రహదారులు

ఎండ తీవ్రతను తట్టుకోలేక 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్టుకింద వాహనాలను నిలిపివేసి సేద దీరారు. ఫలితంగా ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగించారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు జనం శీతలపానీయాలను ఆశ్రయించారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు విక్రయాలు జోరందుకున్నాయి. మరోపక్క వచ్చే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. ఏప్రిల్ నెలలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే ఇక మే నెలలో పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వడగాడ్పులతో జాగ్రత్త



రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడగాడ్పులు వీస్తున్నాయి. మే నాటికి ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండలో పని చేసే వారికి, తిరిగే వారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైన వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి క్లాత్‌తో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓరల్ రీ హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– ఆర్ ఆర్ పవన్‌కుమార్, మండల వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి



ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణగా గొడుగును ఆశ్రయించిన యువతులు



నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు - సామర్లకోట రోడ్డు

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును తీసుకువెళ్లాలి.
- పలుచటి తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరుబయట అధిక శ్రమతో కూడిన పనులు చేయకూడదు.
- మంచినీరు, మజ్జిగ, నిమ్మరసంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, శీతల పానీయాలు తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలి వారికి వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.
- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలు సేవించాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినపుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

స్కేటింగ్ శిక్షణకు అడ్మిషన్లు ప్రారంభం



తునిలో ఏర్పాటు చేసిన స్కేటింగ్ ట్రాక్

తుని: తుని, పరిసర ప్రాంతాల్లోని క్రీడాకారుల కోసం రోలర్ స్కేటింగ్ అకాడమీ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సోమవారం తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కెటింగ్ అకాడమీలో శిక్షణ పొందడానికి క్రీడాకారుల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో నిర్మించిన స్కేటింగ్ ట్రాక్‌లో కోచ్ ద్వారా స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారని చెప్పారు. అడ్మిషన్ కోసం నెలకు రూ.1000 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 77665 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు ఎస్టీ రాజాపురంలో గడపగడపకూ..

గండేపల్లి: మండలంలోని ఎస్టీ రాజాపురంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. పార్టీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

నేటి నుంచి కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 20 వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ గరగల సంబరం నిర్వహిమన్నారు. 20న చండీహోమంతో ఈ జాతర మహోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

సుపరిపాలన జగన్‌తోనే సాధ్యం



ఎస్.అన్నవరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఎస్.అన్నవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. మండలంలోని ఎస్.అన్నవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కొనసాగించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజా సంక్షేమాన్ని విడిచేదిలేదన్నారు. పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. అన్నిరంగాలను అభివృద్ధి చేస్తూనే రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు, ప్రణాళికతో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను మెరుగుపర్చుతున్నట్టు తెలిపారు. ఎన్నో విభాగాల్లో రాష్ట్రం దేశంలో మొదట ఐదు స్థానాల్లో నిలుస్తుందన్నారు. ప్రజల సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, నాయకులు వంగలపూడి కాంతారావు, వంగలపూడి గోవిందుబాబు, కీర్తి రాఘవ, శ్రీహరిరాజు, కుసనం దొరబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఏపీఎం వై.సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ సక్రమంగా జరగాలి

తుని రూరల్/తొండంగి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుకను సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ జి.నాగమణి సూచించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలను, తుని ఆర్ఎంసీ భవనాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, కంప్యూటర్ సిబ్బందితో సమీక్షించారు. జగనన్న విద్యాకానుకను స్టాక్ పాయింట్ నుంచి తీసుకుని సంబంధిత విద్యార్థుకు సక్రమంగా అందించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. రికార్డులు అస్తవ్యస్తంగా ఉంటే సంబంధిత అధికారులపై చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. సమగ్రశిక్ష అభియాన్ సీఈఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈవో షేక్‌బాబ్జీ పాల్గొన్నారు.

స్కూళ్ల ప్రారంభం నాటికి కిట్లు

రౌతులపూడి: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రాఠశాలల ప్రారంభం నాటికే విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందుబాటులో ఉంచాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎస్ఏ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. పాఠశాలల పునఃప్రారంభానికి ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం అవసరమైన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టాకు పాయింటుగా గుర్తించారు. ఎంపీడీఓ ఎం.గోవిందు, ఎంఈఓలు ఎస్వీ నాయుడు, ఎస్వీ రమణ పాల్గొన్నారు.



తొండంగిలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్జేడీ నాగమణి

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్జేడీ ఎ.నాగమణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సంక్షేమ పథకాలపై బురదజల్లడం తగదు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: వ్యక్తిగత రాజకీయాల కోసం ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై బురద జల్లడం ప్రతిపక్షాలకు తగదని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. వీరవరంలోని తోట గాంధీ నివాసంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో పేద ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలను' ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు రాజకీయ మనుగడ కోసం సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో లేనిపోని అపోహలు కల్పించడం సరికాదన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న కిర్లంపూడి మండలం రాజుపాలెం నుంచి జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి వెళ్లే రోడ్డును రూ.28 కోట్లతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, దోమాల గంగాధర్, తోట విష్ణు, పలువురు వైస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్యం



వీరవరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని వీరవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, తోట గాంధీ, తోట వేణు, వైద్యులు వి.అరుణ, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు గర్భిణులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణుల ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు అందించారు. రాచపల్లి పీహెచ్‌సీలో స్థానిక మామిడి నరసింహమూర్తి, అనంత లక్ష్మి దంపతులు గర్భిణుల మధ్య కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవం జరుపుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలకు వచ్చిన 160 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. పెద్దిపాలెం పీహెచ్‌సీలో 52 మంది గర్భిణులకు పశ్చిమగోదావరి జిల్లా తాళ్ల గోకవరానికి చెందిన బుర్రా శ్రీను భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలోని గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు వివేకానందా సేవాసమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. టీడీపీ నేత వరుపుల సత్యప్రభ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

44 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



రాచపల్లిలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శంఖవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 44 మంది గర్భిణులకు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌వీవీ సత్యనారాయణ వైద్య పరీక్షలు చేసి ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఆరోగ్యంపై గర్భిణులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి సీహెచ్‌సీలో 70 మంది గర్భిణులకు..

రౌతులపూడి: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్(పీఎంఎస్ఎంఏ)లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జానకీదేవి 70 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. గర్భిణులు ప్రతిరోజూ సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ ఎం.గోవిందు ఆర్థిక సాయంతో గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

మహిళా పోలీసు కళావతికి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు



మంగళగిరిలో అవార్డు అందుకుంటున్న మహిళా పోలీసు కళావతి

జగ్గంపేట: మండలంలోని నరేంద్రపట్నంలో మహిళా పోలీసుగా పని చేస్తున్న బొంకు కళావతికి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు మంగళగిరిలోని ఎస్ఈబీ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం అమరావతి అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యానర్ చేతులమీదుగా ఆమె బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. సారా నిర్మూలనలో కళావతి చూపించిన తెగువ, కృషిని ఉన్నతాధికారులు గుర్తించి అవార్డు అందజేసినట్టు చెప్పారు. ఆమెను పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్, జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు అభినందించినట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు సోమవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గెద్దనాపల్లి గ్రామానికి చెందిన పతకంశెట్టి నాగేశ్వరరావు (46) ఈ నెల 5న అదే గ్రామానికి చెందిన పెంకె అప్పారావు బెల్లం మకాంలోకి బెల్లం వంటకు వెళ్లాడు. బెల్లం వండుతున్న సమయంలో అదుపుతప్పి పెనంలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అప్పారావును స్థానికులు ఓ ప్రైవేట్ వాహనంలో వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె.రామకృష్ణమూర్తి తెలిపారు.

పెద్ద మసీదు అభివృద్ధికి సహకారం



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రహదారి విస్తరణతో నష్టపోతున్న పెద్ద మసీదు పునర్నిర్మాణానికి అన్ని విధాలా తోడ్పాడతానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రంజాన్ సందర్భంగా మసీదు సెంటర్‌లోని జామియా మసీదులో సోమవారం ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. రానున్న రంజాన్ నాటికి మసీదును సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తానన్నారు. ఆది నుంచి తనకు ముస్లిం మైనారిటీలు అండగా ఉన్నారని, వీరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. జామియా మసీదు అధ్యక్షుడు ఇజాదుద్దీన్, కార్యదర్శి నాజీర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రహ్మాన్ ఖాన్, డైరెక్టర్లు కరీం, జాఫర్‌ఖాన్, పార్టీ మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు బాషా, నగర అధ్యక్షుడు ఖాలిదుద్దీన్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

కిర్లంపూడి: పేదల ఆర్థికాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని వీరవరంలో సోమవారం ఆయన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ తోట సత్యవతితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాలను ఆప్యాయంగా పలకరించి సమస్యలు ఏమైనా ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు వారి అనుమతితో సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. గ్రామంలో ప్రభుత్వం పనితీరుపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తోట గాంధీ, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, ఎంపీటీసీ తోట వేణుగోపాలరావు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట విష్ణు, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వీరవరంలో మహిళకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు



ప్రత్తిపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్



ఏలేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంచి చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

ప్రత్తిపాడు: ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కోరారు. ప్రత్తిపాడులో సోమవారం ఎంపీపీ క్రాంతిసుధాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్రి రమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. 16వ వార్డులో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బెహరా దొరబాబు, ఎంపీటీసీ పినిశెట్టి అమృత వర్షిణి, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.వెంకటరత్నం, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. స్థానిక 20 వార్డులో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. 9వ వార్డులో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వాగుబలరామ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.